# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ ని విద్యా రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలనేదే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

- ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

- తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుండి సుప్రభాత సేవను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

- టైప్-1 డయాబెటీస్ సంరక్షణను ఆయుష్మాన్ భారత్ లో చేర్చాలని విశాఖపట్టణం పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్ అన్నారు.

=================

ఆంధ్రప్రదేశ్ ని విద్యా రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలనేదే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో ఈరోజు జరిగిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల బృహత్ సమావేశం `మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్` లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఊహించని ఫలితాలు సాధిస్తామని, దీనికి అందరి సహకారం ఉండాలన్నారు. పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారికి సరైన శిక్షణ ఇస్తే ఏదైనా సాధించగలరని తెలిపారు. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచామని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నామని చంద్రబాబు నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... సమాజం మనకెంతో ఇచ్చిందని.. బడి ద్వారా ఋణం తీర్చుకోవాలని అన్నారు. తరగతి గది నుండే దేశ భవిష్యత్ మార్చవచ్చు అని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా క్లికర్స్ విధానాన్ని భామినిలో

ప్రారంభిస్తున్నామని, లీప్ యాప్ ద్వారా తల్లి తండ్రులు తమ పిల్లల చదువు గురించి తెలుసుకోవచ్చని మంత్రి తెలుపుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల బృహత్ సమావేశం -మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు నిర్వహించింది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కార్యక్రమలలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

=================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంలో పిల్లలకు నైపుణ్యాల శిక్షణను చేర్చటం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేసిన అనేక పరిశోధనలను పరిశీలించి.. వారితో మమేకమయ్యారు. అనంతరం మాట్లాడుతూ... పిల్లల బలాలు, బలహీనతలు తల్లిదండ్రులు తెలుసుకోవటానికి, వారు మన సంస్కృతిని గౌరవించేలా చేయటానికి ఈ కార్యక్రమం ఒక వారధిలాంటిదని అన్నారు. శారీరక దారుఢ్యానికి వ్యాయామంలాగే, మానసిక దారుఢ్యానికి పుస్తక పఠనం దోహదపడుతుందన్నారు. అందువల్ల విద్యార్థులు పుస్తకాలు చదవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

=================

ఆయుష్మాన్ భారత్ కింద అవుట్ పేషెంట్ లో టైప్-1 డయాబెటీస్ సంరక్షణను చేర్చాలని విశాఖపట్టణం పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్ అన్నారు. లోక్ సభలో ఈరోజు టైప్-1 డయాబెటీస్ పై మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలకు టైప్-1 డయాబెటిస్ (T1D) ముప్పుగా మారిందన్నారు. పిల్లలను టైప్ 1 డయాబెటీస్ నుండి కాపాడేందుకు జన ఔషధి కేంద్రాలు, ప్రజారోగ్య కేంద్రాల నుంచి ఇన్సులిన్, గ్లూకోజ్ సరఫరా నిరంతరం ఉండాలన్నారు. T1D సంరక్షణ కోసం జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేసేలా రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహించాలని సూచించారు.

=================

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామంలో కోటీ 65 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తో కలిసి ఈరోజు ప్రారంభించారు. అలాగే ఆరు పడకల ఆసుపత్రి భవనం ప్రారంభ సూచికగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతన భవనంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వైద్య సదుపాయాలను వారు పరిశీలించారు.

విరామం

=================

ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. జిల్లా నుంచి అంతర్ రాష్ట్ర ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ ఈరోజు తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఉత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చన్నారు. ఈ అంతర్ రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలు ఈ నెల 11, 12వ తేదీలలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరగనున్నాయి.

=================

తిరుమల వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలిపింది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో `డయల్ యువర్ టిటిడి ఈఓ` కార్యక్రమం ఈరోజు జరిగింది. అనంతరం టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పాత్రికేయులతో మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో మొత్తం 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు సామాన్య భక్తులకే కేటాయింపు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 30 నుండి జనవరి 08వ తేదీ వరకు 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయన్నారు. ఈ పది రోజులలో 7 లక్షల 70 వేల మంది భక్తులకు దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 01వ తేదీలకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తామన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

=================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుండి సుప్రభాత సేవను రద్దు చేస్తుస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ధనుర్మాసం సందర్భంగా జనవరి 14వ తేదీ వరకు సుప్రభాత సేవను రద్దు చేసినట్లు టిటిడి ఆ ప్రకటనలో పేర్కొంది. సుప్రభాతం స్థానంలో గోదాదేవి రచించిన తిరుప్పావై పాశురాల పఠనంతో శ్రీవారికి మేలుకొలుపు ఉంటుందని.. డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామని.. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తున్నట్లు టిటిడి వెల్లడించింది. డిసెంబర్ 31న ద్వాదశి సందర్భంగా చక్రస్నానం నిర్వహిస్తామని ఆ ప్రకటనలో తెలిపింది.

=================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంలో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=================

విజయవాడలో 3వ "కృష్ణవేణి సంగీత నీరాజనం" కార్యక్రమాన్ని రేపటి నుండి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దక్షిణ ప్రాంత డైరెక్టర్ డి. వెంకటేశన్ తెలిపారు. సంగీత నీరాజనం కార్యక్రమంపై విజయవాడలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ సహకారంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో 98 మంది కళాకారులతో 18 కచేరీలు ఉంటాయని చెప్పారు. "కర్ణాటక సంగీత గమ్యస్థానంగా విజయవాడ" ఇతివృత్తంతో జరిగే ఈ కార్యక్రమాన్ని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారని తెలియజేశారు.

=================

=================